

శ్రీ రోశయ్యగారు అన్నిరకాల సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్యావిషయక విషయాలన్నింటిపైనా తనదైన హేతువాద దృక్పథాన్ని ఏర్పరచుకొన్నారు. స్పష్టమైన సిద్ధాంతాలను రూపొందించుకొన్నారు. జీవితాంతం వాటికి కట్టుబడివున్నారు.

# స్పష్టమైన హేతువాది - శ్రీ రోశయ్య

## శ్రీ సి. నరసింహారావు

ఎలవర్తి రోసయ్య గారిని మొదటిసారి 1972లో, వాళ్ళ పెద్దబ్బాయి చిన్నయ్యసూరికి నా చెల్లెలు దేవకీ దేవిని ఇవ్వడంకోసం కలిశాను. మా కుటుంబ వివరాలు చెప్పాను. అన్నీ వివరించడం అయిదునిముషాల్లో ముగిసింది. ఆయన నేను చెప్పింది వినడం మినహా మరేమీ ప్రశ్నించలేదు. ఆ తరువాత మా ఇంటి పేరు అడిగారు. 'చల్లగుళ్ళ' అని చెప్పాను. శ్రద్ధగావిని ఆ తరువాత తన బీరువానుండి ఓ పుస్తకం తీసారు. ఆ పుస్తకంలో కమ్మకులానికి చెందిన వారందరి ఇళ్ళ పేర్లు, వాళ్ళ గోత్రాలు, వాళ్ళు వుంటున్న గ్రామాలపేర్లు వుంటాయి. రోశయ్యగారు ఎంతో ఆసక్తితో ఆ పుస్తకం తిరగవేశారు. ఆ పుస్తకంలో మా ఇంటిపేరు కనిపించలేదు. ఆయన తీవ్రనిరాశకు లోనయ్యారు. అందులో'చల్లగుండ్ల' అనే పేరు వుంది. 'చల్లగొళ్ళ' వుంది. 'చల్లగుళ్ళ' మాత్రం కనిపించలేదు. మా ఇంటిపేరు 'చల్లగుండ్ల' అయివుంటుందేమోనని అనుమానం వెలిబుచ్చారు. కాదని స్పష్టంగానే చెప్పాను. ఆ పుస్తకంలో పేర్లన్నీ అకారాది క్రమంలో వున్నాయి. ఆయన ఎంత తిరగవేసినా మా ఇంటి పేరు కన్పించలేదు. ఎంతో నిస్పృహకు లోనయినట్లు ఆయన ముఖ కవళికల ద్వారా నాకు అర్థమయ్యింది. ఈ పుస్తకంలో అన్ని ఇళ్ళపేర్లు

వుంటాయి. ఇందులో లేని పేరు నాకింతవరకూ తగలలేదు అని చుట్టూవున్న వారితో ఒకటికి పదిసార్లు చెప్పారు. ఎవరికీ ఏమీ తోచలేదు.

ఇంతలో ఫలహారం, కాఫీ తీసుకున్నాం. ఇతర విషయాలేం ప్రస్తావించబోయినా ఆయన అన్య మనస్కంగానే వున్నారు. ఆ పుస్తకాన్నే ఒకటికి పదిసార్లు తిరగవేస్తున్నారు. ఉన్నట్లుండి మా ఇంటిపేరు కనిపించింది. ఇక ఆయన సంతోషానికి అవధులు లేవు. మా ఇంటిపేరు వుందని ప్రతి ఒక్కరికీ చెప్పారు. ఆయన భార్య లోపలవుంటే ప్రత్యేకించి పిలిచిమరీ చెప్పారు. చివరికి మా ఇంటిపేరు చల్లగుళ్ళ కాదని, చల్లగుళ్ళ అని వివరించి చెప్పారు. 'చ' అనే అక్షరాన్ని 'చ' గా ఎప్పుడు వ్యవహరిస్తారో, వాడుకలో 'చ' అనే అక్షరం ఎలా క్రమంగా తొలగి పోతోందో వివరించారు. మా గ్రామంలోని ఇంటిపై వ్రాసిన పేర్లలో 'చ' అనే వుండేదని చెప్పాను. ఆయన మరింతగా సంతోషపడిపోయారు. చల్లగుళ్ళ అనే పేరును ఎలా ఉచ్చరించాలో 'చల్లగుళ్ళ' అనే పేరును ఎలా ఉచ్చరించాలో తెలియజెబుతూ ఒకటికి రెండుసార్లు ఉచ్చరించారు. పైగా నాతప్పేమీలేదని, వారి కాలేజీలో పనిజేసే అధ్యాపకులకు సైతం ఈ తేడా స్పష్టంగా తెలియదని, వారు కూడా సవ్యంగా ఉచ్చరించరని తెలుపుతూ విసుక్కున్నారు. నేను తేలిగ్గా ఊపిరి పీల్చుకొని, వివాహ సంబంధానికి ఆయన పూర్తి అంగీకారం తెలిపినందుకు సంతోషిస్తూ బయట పడ్డాను.

శ్రీరోశయ్యగారు తనచుట్టూ వున్న ప్రపంచాన్ని, దాని పోకడలను పెద్దగా పట్టించుకొనేవారుకాదు. అంటే ఆయన ఏ మాత్రం లౌకికవాదికాదు. అలాగే ఆధ్యాత్మిక చింతనతో గడిపే అలౌకికవాది అసలేకాదు. ఆయన అతి ఖచ్చితమైన, స్పష్టమైన హేతువాది. నిరంతరం ఆయనకు తన మేధా ప్రపంచంతోనే సహవాసం. ప్రతిరోజూ ప్రొద్దున్నే ఆయన ఆంగ్ల, తెలుగు దిన పత్రికలను చదవటానికి రెండు గంటల సమయాన్ని వెచ్చించేవారు. అవి చదివే సమయంలో ఎర్ర పెన్సిల్‌ను తన వద్ద వుంచుకొనేవారు. ఆ పెన్సిల్‌తో మంచి వాక్య నిర్మాణం కనిపించితే

రైట్ కొట్టేవారు. వాక్య నిర్మాణంలో ఏ చిన్న దోషం కనిపించినా ఆ భాగాన్ని అండర్‌లైన్ చేసి, ప్రక్కన తప్పుకు చిహ్నంగా ఇంటూ మార్కు పెట్టేవారు. అరసున్నా పెట్టవలసిన చోట అరసున్నా పెట్టకపోయినా ఆయన తప్పుపట్టేవారు. ఆయనకు వ్యావహారికభాష పట్ల ఏమాత్రం మక్కువలేదు. కాని, వ్యవహారిక భాషకు కూడా కనీస నియమనిబంధనలు పాటించాలనేవారు. తెలుగుభాష సొగసును, విలక్షణతను, ఛందః ప్రమాణాలను ఎవరికి తోచినట్లు వారు దిగజార్చడం ఆయన ఏమాత్రం సహించగల్గేవారుకాదు. హిందూ పత్రికలో ఆంగ్లభాష నిర్దుష్టంగా వుంటుందని అందరూ అభిప్రాయపడేవారు. కాని ఆపత్రిక నిండా కూడా ఆయన కొట్టివేతలు కనిపించేవి. ఆంగ్ల భాషా సాంప్రదాయాలను మార్చే అధికారం ఎవరికీ లేదని ఆయన నొక్కినక్కాణించేవారు. పత్రికలో వాడే భాషలో దోషాలు వెదకడం భావ్యం కాదని, వివిధ విషయాలు వివరించడం కోసం, తమ సౌలభ్యంకోసం అలా కొన్ని మార్పులు చేయక తప్పదని చెప్పబోతే, తెలుగుభాష సొగసును, విశిష్టతను దెబ్బతీయడం సరికాదని, కొన్ని నిర్దుష్ట ప్రామాణికాలకు కట్టుబడి వుండకపోతే ఏ భాషావికాసం సాధ్యం కాదని వివరించేవారు.

శ్రీరోశయ్యగారు యూనివర్సిటీ విద్య పూర్తి చేసేసరికి దేశంలో పెద్ద మేధాసంక్షోభం నెలకొని వుంది. బ్రిటిష్ పాలన వలన మేలుజరుగుతుందా లేక స్వదేశీ పాలన కావాలా? కాంగ్రెసు సిద్ధాంతాలు ఎంతవరకు అనుసరణీయం? కమ్యూనిస్టు సిద్ధాంతాల వలన దేశాభ్యుదయం సాధ్యమవుతుందా? మన సంప్రదాయాలు, సంస్కృతి మనల్ని ఎటు తీసుకువెళుతున్నాయి? ఎం.ఎన్.రాయ్ నవ్యమానవవాదం ఏం ప్రతిపాదిస్తోంది? మన సంస్కరణవాదులు చెప్పేవి ఎంతవరకు ఆచరణసాధ్యమవుతాయి? అప్పట్లో చదువుకొన్న వారిలో, విద్యార్థులలో ఇవే చర్చలు సాగుతుండేవి.

కమ్యూనిజాన్ని ఆయన పూర్తిగా వ్యతిరేకించేవారు. అలాగే కమ్యూనిజం వలన ప్రభావితమైన కాంగ్రెస్ అన్నా, కాంగ్రెస్ నాయకులన్నా ఆయనకు తిరస్కార భావమే ఉండేది. మాకినేని బసవ పున్నయ్య, టి. వెంకటేశ్వరరావు వంటి ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు ఆయన సహాధ్యాయులు. వారు నమ్మే సిద్ధాంతాలను ఆయన నిరసించినా వారి చిత్తశుద్ధిని ఆయన శంకించేవారు కాదు. ఎప్పుడూ తమ స్వార్థప్రయోజనాలకోసం దేశాన్ని నాశనం చేయడానికి వెనుకాడని కాంగ్రెస్‌వాదులకంటే, ప్రజలకెలా మేలు చేయాలా అని ఆలోచించే కమ్యూనిస్టులే కొంతవరకు మెరుగని ఆయన భావించేవారు.

ఈ ప్రపంచానికి మూలం వ్యక్తేనని, వ్యక్తుల ఆలోచనా ధోరణిలో మార్పు తీసుకురావడం ద్వారా మాత్రమే వ్యవస్థ మారుతుందని ఆయన విశ్వసించేవారు. తన జీవితంలో ఆయన అనేక సాంప్రదాయక పద్ధతులను త్రోసిపుచ్చారు. వితంతువివాహానికి ఆ రోజుల్లో సిద్ధపడిన శ్రీరోశయ్యగారు ఆ అంశాన్ని తన జీవితకాలంలో ఎన్నడూ ప్రస్తావించి ఎరుగరు. కులాంతర వివాహాలను సమర్థిస్తూనే, కుల భావనను మనస్సు నుండి తొలగించుకోకుండా, కులాంతర వివాహాల వలన పెద్ద ప్రయోజనం చేకూరదని చెప్పేవారు. అగ్రకులానికి చెందిన వ్యక్తిని నిమ్నకులానికి చెందిన యువతి వివాహమాడి, జీవితాంతం త్యాగం చేశానని మదనపడడం కంటే, తన భార్య తక్కువ కులానికి చెందిన వ్యక్తి అని నిరంతరం మననం చేసుకోవటం కంటే ఇటువంటి కులాంతర వివాహాల జోలికి వెళ్ళక పోవడమే మెరుగని ఆయన చెప్పేవారు.

''ప్రతి ఒక్కరి ఇంటిపేరు, వారి కులం తెలుసుకోవడానికి మీరు కనపరచే ఆసక్తి వలన, మీకు కమ్మ కులం పట్ల అభిమానిగా అందరూ అనుకొంటారు'' అని నేనొకసారి వారితో అన్నాను. అందుకాయన, ''తప్పు, తప్పు'' అంటూ ముక్కుపై వేలు వేసుకొని, ''ఏ గ్రామంలో ఏ కులంవారు, ఏ ఇంటిపేరుగలవారు వున్నారోనని, వారి వృత్తులు, వారి ఆర్థికస్థాయి, వారి విద్యా వ్యాసంగం తెలుసుకోవడం నాకెంతో

ఆసక్తిదాయకమైన అంశం. ఇదొకరకంగా నాకున్న ఆంత్రొపొలాజికల్ ఇంట్రస్టు. ఇతర కులాలకు చెందిన విద్యార్థులెందరో నాకు అభిమాన పాత్రులు. వివిధకులాల వారి జీవన విలక్షణతను అవగతం చేసుకోవడానికి నేనెప్పుడూ ప్రయత్నిస్తుంటాను.'' అని వివరించారు. తనవిద్యార్థులు జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగడం చూసి ఎంతో గర్వించే ఆయన, వారి కులాన్ని ప్రస్తావించడంద్వారా, ఎంతో ప్రతికూల వాతావరణంలో, కష్టపడి చదువుకో గలిగారన్న అభినందనే కనిపించేది.

వైయక్తిక విలువలకు ఆయన ఇవ్వవలసిన దానికంటే అధిక ప్రాధాన్యతను ఇచ్చేవారు. తాను ప్రిన్సిపల్‌గా వున్నప్పుడు తన వద్ద పనిచేస్తున్న అధ్యాపకుడొకతన్ని ఈయన ఎంతగానో అభిమానించేవారు. అతనెంతో ప్రతిభావంతుడని ప్రశంసించేవారు. ఆ అధ్యాపకుడొకసారి సిగరెట్టు కాల్చుతూ ఈయన కంటపడ్డాడు. తరువాత ఆ అధ్యాపకుడిపట్ల ఈయన అభిప్రాయంలో చాల మార్పువచ్చింది. ''అతనెంతటి ప్రతిభావంతుడైతే మాత్రమేమిటి, బీడీలు కాలుస్తాడు'' అని తననిరసనను ప్రకటించేవారు. అలాగే అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న రాజకీయ నాయకుడిని జీవితాంతం ఆయన చీదరించుకొంటూనే వుండేవారు. సమాజం కోసం, ప్రజల అభ్యున్నతి కోసం పాటు పడేవారిని ఈయన ప్రతిసందర్భంలోనూ మెచ్చుకొనేవారు. ఆయనకు ఖచ్చితమైన, నిర్దుష్టమైన అభిప్రాయాలు వుండేవి. బలమైన ఇష్టాయిష్టాలు వుండేవి.

శ్రీ రోశయ్యగారు అన్నిరకాల సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్యావిషయక విషయాలన్నింటిపైనా తనదైన హేతువాద దృక్పథాన్ని ఏర్పరచుకొన్నారు. స్పష్టమైన సిద్ధాంతాలను రూపొందించుకొన్నారు. జీవితాంతం వాటికి కట్టుబడివున్నారు.